## క్లుప్తంగా

### క్రిస్టియన్ మైనార్టీ సంయుక్త కార్యదర్శిగా రత్నంరాజ్

**అమలాపురం టౌన్:** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు వజ్జరపు రత్నంరాజ్‌ను పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శిగా పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావులు రత్నంరాజ్‌ను అభినందించారు.


### ఘనంగా రమణయ్య జయంతి



రమణయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డీబీ లోక్ తదితరులు

**అమలాపురం టౌన్:** మాజీ ఎమ్మెల్యే, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీవీ రమణయ్య 92వ జయంతిని స్థానిక గడియారం స్తంభం సెంటరులో గురువారం నిర్వహించారు. పేద విద్యార్థుల చదువులకు, వసతి గృహాల సౌకర్యానికి ఆయన ఎంతో పోరాడారని ముఖ్య అతిథి, ఆర్పీఐ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. తొలుత రమణయ్య చిత్ర పటానికి వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో పెనుమాల చిట్టిబాబు, ఇసుకపట్ల రఘుబాబు, కాశి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల వైపు పోవద్దు



బొమ్మల ద్వారా మాదక ద్రవాల దుష్పరిణామాలను వివరిస్తున్న ఎస్సై శ్రీనివాస్

**అమలాపురం టౌన్:** విద్యార్థులు మాదక ద్రవ్యాల వైపు పోవద్దని ఎస్సై టి.శ్రీనివాస్ విద్యార్థులకు హితవు పలికారు. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ఈ మేరకు అవగాహన సదస్సు నిర్వహించి మాదక ద్రవ్యాల వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలను వివరించారు. పాఠశాల హెచ్ఎం కె.ఘన సత్యనారాయణ మాదక ద్రవాల నిరోధంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### విద్యార్థినికి రూ.75 వేల వితరణ



ప్రవల్లికకు రూ.75 వేల చెక్కును అందజేస్తున్న వశిష్ట క్లబ్, ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** ముమ్మిడివరానికి చెందిన పేరూరి ప్రవల్లిక ఐఏఎస్ శిక్షణ నిమిత్తం అమలాపురం లయన్స్ వశిష్ట క్లబ్, ఆజాద్ ఫౌండేషన్ సంయుక్తంగా రూ.75 వేలు సమకూర్చాయి. పేద కుటుంబానికి చెందిన ప్రవల్లిక ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. లయన్స్ వశిష్ట క్లబ్ అధ్యక్షురాలు మాకిరెడ్డి పూర్ణిమ, ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ విద్యార్థిని ప్రవల్లికకు ముమ్మిడివరంలో రూ.75 వేల చెక్కును గురువారం అందజేశారు.

### రేపు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

**అమలాపురం టౌన్:** పట్టణంలో శనివారం జరగనున్న సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతున్నారని పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తెలిపారు. పట్టణంలో పలు స్మారక స్థూపాల వద్ద మహాసభల ఏర్పాట్లపై గురువారం ఆయన సమీక్షించారు. పార్టీ కార్యదర్శి కార్యవర్గ సభ్యులు డేగ ప్రభాకర్ కూడా అమలాపురంలో మహాసభల ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ నాయకులు పి.రాము, కె.రామకృష్ణ, దేవ రాజేంద్ర ప్రసాద్, నిమ్మకాయల శ్రీనివాస్, గూడాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### కరోనా మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

**యానాం:** యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో కరోనాతో మృతులబాధిత కుటుంబాలకు రూ.50 వేల నష్టపరిహారం ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు చెల్లించలేదని గురువారం స్థానిక బీజేపీ నాయకుడు పెసల వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు 30 రోజుల్లో పరిహారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని అప్పట్లో సుప్రీంకోర్టు సైతం ఆదేశించిందన్నారు. అయితే కొంతమందికి ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వకుండా చేతులు దులుపుకొన్నారని ఆయన విమర్శించారు. యానాం రీజియన్‌లో చాలమందికి పరిహారం ఇప్పటికీ రాలేదని తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలనికోరారు.



క్రీడా మైదానంలో కనపడుతున్న ప్లాస్టిక్, గాజు సీసాలు, ఎముకల వ్యర్థాలు



పల్లంకుర్రు-2 లాకు వద్ద తొలగించిన మట్టి



కందికుప్పలో ఆకాశం సన్యాసి జెడ్పీహెచ్ పాఠశాల

# మరుభూమి కాదు.. మైదానమే!

- మెరక చేయాలని కోరితే మరింత అధ్వానం చేశారు
- కళేబరాలు, ప్లాస్టిక్, మద్యం సీసాల వ్యర్థాలతో చదును చేసే యత్నం
- స్థానిక నాయకుడి నిర్వాకంతో విద్యార్థులకు అవస్థలు
- కందికుప్ప జెడ్పీ పాఠశాల మైదానంలో ప్రత్యక్ష నరకం



క్రీడా మైదానంలో వేసిన వ్యర్థాలతో కూడిన మట్టి

**కాట్రేనికోన:** పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి. వసతులు.. సౌకర్యాలు.. మరుగుదొడ్లు.. ఇలా ఎన్నెన్నో ఉన్నాయంటూ ఊకదంపుడు ప్రచారాలు చేశారు. తీరా చూస్తే పిల్లలకు ఎక్కడో అక్కడ ఏదో ఒక సమస్య. స్థానిక కందికుప్పకు చెందిన ఆకాశం సన్యాసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం విద్యార్థులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. కారణం.. మైదానం పల్లంగా ఉండడం.. ఎక్కడికక్కడ నీరు నిలచిపోవడం.. గడ్డి మొలిచి ఆ నీటిలో నానిపోయి, కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లడం ఇలా ఒకటీ రెండూ కాదు.. ఆడుకోవడానికి ఏమాత్రం ఉపయోగం లేకుండా తయారైంది.

ఈ కందిప్ప జెడ్పీహెచ్ పాఠశాలకు ఇటీవలే ఆకాశం సన్యాసిరావు పేరును పెట్టారు. ఈ సందర్భంగా ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కందికుప్పకు వచ్చిన సమయంలో అడవిపేట కమ్యూనిటీ స్థలం, పాఠశాల క్రీడామైదానంలోని సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పాఠశాల క్రీడా స్థలం, అడవి పేట కమ్యూనిటీ స్థలం మెరక పనుల బాధ్యతలను స్థానిక నాయకుడికి అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా సదరు నాయకుడి చర్యల వల్ల ఆ పాఠశాల విద్యార్థులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. క్రీడా మైదానం మెరక పనులకు సదరు నాయకుడు బొబ్బర్లంక- పల్లంకుర్రు బ్యాంకు కెనాల్ ఆధునీకరణలో భాగంగా పల్లంకుర్రు-2 పంట కాలువ వద్ద లాక్, కాంక్రీట్ వాల్ పనుల కోసం పంట కాలువ నుంచి తొలగించిన మట్టిని తీసుకురావడం తీవ్ర చర్చనీయాంశమైంది. కాలువలో కొట్టుకువచ్చిన మృత కళేబరాల వ్యర్థాలు, ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఆ మట్టిలో కలసిపోయి ఉంటాయి. ఆ మట్టిని తీసుకువచ్చి పాఠశాల క్రీడా మైదానంలో, అడవిపేట కమ్యూనిటీ స్థలంలో మెరక పనులకు తరలించారు. దీంతో ఆయా ప్రాంతాలు తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ చిన్నారులకు, ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా తయారయ్యాయి. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుకను ఊడినట్టు ఉందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. రైతుల నుంచి మట్టిని సేకరించి ఆయా స్థలాలను మెరక చేసి ఉంటే బాగుండేదని స్థానికులు అంటున్నారు. పాఠశాల క్రీడా స్థలంలో వేసిన వ్యర్థాలతో కూడిన మట్టిని తొలగించి విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ఉండే మట్టిని వేయాలని విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

> **మంచి మట్టితో మెరక చేయిస్తాం**
>
> **పాఠశాల ఆటస్థలం పల్లంగా ఉండటంతో నిరుపయోగంగా ఉంది. మట్టితో మైదానాన్ని పూడ్చమని** ఆదేశిస్తాను. స్థానిక నాయకులు ముందుకు వస్తే పనులు చేయమన్నాం. మట్టి నాణ్యత లేక పోవడం, ప్లాస్టిక్, గాజు సీసాలు, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నారు.
>
> – రాధిక రాణి, హెచ్ఎం, ఆకాశం సన్యాసి జెడ్పీహెచ్ పాఠశాల

### నేత్రదానం



నేత్రదాత నరసింహారావు

**తాళ్లరేవు:** స్థానిక విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ కాటాడి నరసింహారావు (73) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యుడు రమేష్‌ను స్థానిక సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ (బాబి) సంప్రదించి నేత్రదానం ప్రాముఖ్యాన్ని వివరించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సిబ్బంది రవి, నాని తదితరులు నరసింహారావు కార్నియాలను సేకరించారు. ఇంతటి విషాద సమయంలో కుటుంబ సభ్యుల నిర్ణయం వల్ల ఇద్దరు అంధులకు వెలుగునిచ్చి వారవుతారని బాబి అన్నారు. కుటుంబ సభ్యులను తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పరామర్శించారు.

### హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**అమలాపురం రూరల్:** ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. త్వరలో 11వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, 21 ఏళ్లు నిండి, లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు ఈ శిక్షణకు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రజాక్‌ను 73829 09588 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అతి తక్కువ సీట్లు మాత్రమే ఉన్నాయని, అర్హులైన వారు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని డీఎం సూచించారు.

# జేసీ గారూ.. దారి చూపండి..

**గోదావరి సెంట్రల్ డివిజన్ ఇరిగేషన్ ఉద్యోగుల ఆందోళన**



రంగాపురంలో ఈఈ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గోదావరి సెంట్రల్ డివిజన్ ఇరిగేషన్ ఉద్యోగులు

**అమలాపురం రూరల్:** తమ కార్యాయాన్ని జాయింట్ కలెక్టర్ సిబ్బంది ఆక్రమించారని, కార్యాలయానికి వెళ్లే దారి లేకుండా ముఖద్వారాన్ని రేకులతో మూసివేశారని మండలం రంగాపురంలోని గోదావరి సెంట్రల్ డివిజన్ ఇరిగేషన్ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. తమ కార్యాలయానికి వెళ్లే సిమెంట్ రోడ్‌ను జేసీ బంగ్లా సిబ్బంది మూసివేశారని తమ కార్యాలయానికి ఎలా వెళ్లాలని మహిళ ఉద్యోగులు ఈఈ కార్యాలయం వద్ద బైఠాయించారు. రంగాపురం ఇరిగేషన్ ఈఈ కార్యాలయం పక్కనే ఇరిగేషన్ అతిథిఇ గృహాన్ని నిర్మించారని, జిల్లా ఏర్పడినప్పుడు ఈ అతిథి గృహాన్ని జేసీ బంగ్లాకు కేటాయించారన్నారు. ముగ్గురు జేసీలు ఈ బంగ్లాలోనే నివసిస్తున్నారని, అయితే జేసీ బంగ్లాకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఇటీవల ఉపాధి పథకంలో సిమెంట్ రోడ్డు నిర్మించారని, ఈ సిమెంట్ రోడ్డు మీదుగా తమ కార్యాలయానికి వెళ్తున్నామని తెలిపారు. ఈ మార్గం మీదుగా వెళ్లవద్దని జేసీ అంటున్నట్టు ఉద్యోగులు వివరించారు. తాజాగా ఈఈ కార్యాలయానికి అడ్డుగా రహదారిని సిమెంట్ రేకులతో మూసివేశారని, దీంతో శుక్రవారం కార్యాలయం వెనుక భాగం నుంచి తుప్పల మీదుగా వెళ్లామని వారు వాపోయారు. తమ బంగళాలోనే నివసిస్తూ తమ కార్యాలయానికి దారి మూసేయడం ఏమిటని మహిళా ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయమై జేసీని కలిసేందుకు ప్రయత్నించగా కలెక్టరేట్‌లో ఆమెను కలవాలని అక్కడి సిబ్బంది చెప్పారని వారు వాపోయారు. అనంతరం సాయంత్రం డీఆర్‌ఓ రాజకుమారితో చర్చలు జరిపారు. ఈ విషయమై ఈఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా దారి మూసివేయడంపై ఉన్నత అధికారులకు వివరించామని, జేసీతో మాట్లాడి సమస్య పరిష్కరించుకుంటామని తెలిపారు.

# స్తంభానికి చప్టా అనుకునేరు!



విలసవిల్లిలో సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

**ఉప్పలగుప్తం:** సాధారణంగా ఎవరి ఇంటిపైన అయినా, స్థలంపైన అయినా విద్యుత్ స్తంభాలు, తీగలు ఉంటే వాటిని మార్చడానికి ఆ శాఖ బోలెడు నిబంధనలు, రూ.లక్షల్లో చార్జీలు ముక్కుపిండి మరీ వసూలు చేస్తుంది. ఇదిగో ఈ చిత్రాన్ని చూశారా.. ఎన్ని ఫిర్యాదులు చేసినా కనీసం స్పందించకపోవడంతో పంచాయతీ సిబ్బంది వారి పని వారు చేసుకుపోయారు. రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం ఉందో.. విద్యుత్ స్తంభానికి అలా సిమెంట్ గట్టు వేశారో తెలియని అయోమయంగా ఈ చిత్రం ఉంది. మండలంలోని విలసవిల్లి గ్రామంలో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాన్ని తొలగించకపోవడం ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని చూపుతోంది. సీసీ రోడ్డు నిర్మించే క్రమంలో పంచాయతీ అధికారులు స్తంభాన్ని తొలగించాలని పలుమార్లు సమాచారం ఇచ్చినా విద్యుత్ అధికారులు తొలగించలేదని, ఈ విషయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదని గ్రామస్తులు అంటున్నారు. రహదారికి అడ్డుగా స్తంభాలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బంగా మారి రాత్రి వేళలో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# బీఎల్ఓలకు ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన బీఎల్ఓలకు సర్టిఫికెట్లను అందజేసిన తహసీల్దార్ త్రినాథరావు

**తాళ్లరేవు:** ఎన్నికల విధి, విధానాలు, నియమ నిబంధనలపై రెండు రోజులపాటు నిర్వహించిన బూత్ స్థాయి అధికారుల శిక్షణ గురువారంతో ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చీఫ్ ఎలక్షన్ అధికారి ఆదేశాల మేరకు తహసీల్దార్ పితాని త్రినాథరావు, డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబు ఆధ్వర్యంలో 40 మంది బూత్‌స్థాయి అధికారులకు మాస్టర్ ట్రైనర్ కె.బాలాజీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ పొందినవారికి తహసీల్దార్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జి.రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

### ఉచితంగా రెండు కిలోల గోధుమలు

**యానాం:** పుదుచ్చేరి వ్యాప్తంగా రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు ఈ నెల నుంచి ఉచితంగా రెండు కిలోల గోధుమలను ఇవ్వనున్నట్లు సీఎం రంగసామి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉచితంగా బియ్యం ఇస్తున్నామని, అలాగే తాను గతంలో ప్రకటించినట్టు ఉచితంగా గోధుమలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జూలై నెల బియ్యంతో కలిపి గోధుమలు ఇస్తామన్నారు. అలాగే నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ అరవింద్ వీరమణి మర్యాదపూర్వకంగా సీఎం రంగసామిని కలిసారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ సెల్వం, కార్యదర్శి ముత్తమ్మ పాల్గొన్నారు.

### పంచాంగకర్తలకు సత్కారాలు



సత్కారాలు అందుకున్న పంచాంగకర్తలు

**అమలాపురం టౌన్:** అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘ్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఐదు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ పంచాంగకర్తల విద్వత్ సభల్లో అమలాపురానికి చెందిన పంచాంగకర్తలు ఉపద్రష్ట సోదరులకు సత్కారాలు జరిగాయి. పట్టణానికి చెందిన ఉపద్రష్ట నాగాదిత్య, విమలాదిత్య, విక్రమాదిత్యలను సత్కరించారు. మాజీ రాష్ట్రపతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, వీవీ గిరి మనవళ్ల చేతుల మీదుగా తమకు సత్కారాలు జరిగాయని పంచాంగ కర్త నాగాదిత్య తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**అల్లవరం:** అమలాపురం నుంచి అల్లవరం వస్తున్న అంబటి రాజేష్ (22) ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న ఇటుకల గుట్టని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై తిరుమలరావు తెలిపిన వివరాల మేరకు అమలాపురం నుంచి బుధవారం అర్ధరాత్రి మోటారుసైకిల్‌పై వస్తున్న రాజేష్ కోడూరుపాడు పంచాయతీ ఆకులవారివీధిలో ఈ ప్రమాదానికి గురయ్యాడు. అతడు అల్లవరంలోని తన మేనమామ ఇంటిలో ఉంటున్నాడు. రాజేష్ తండ్రి జీవనోపాధి నిమిత్తం హైదారాబాద్‌లో ఉంటుండగా, తల్లి గల్ఫ్‌లో ఉంటున్నారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రాజేష్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబీలకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

### విరిసిన బ్రహ్మ కమలాలు



సుంకరపాలెంలో విరిసిన బ్రహ్మ కమలాలు

**తాళ్లరేవు:** మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీలో బ్రహ్మ కమలాలు విరిసాయి. స్థానిక పంచాయతీ వీధిలోని కొప్పిశెట్టి వెంకట ఈశ్వరరావు స్వగృహంలో ఉన్న బ్రహ్మ కమలం మొక్కకు బుధవారం రాత్రి నాలుగు పువ్వులు పూసి ఆకట్టుకుంటున్నాయి. వీటిని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

### తొత్తరమూడిలో ఎస్ఎస్‌జీ బృందం పర్యటన

**అయినవిల్లి:** తొత్తరమూడి గ్రామంలో ఎస్ఎస్‌జీ బృందం గురువారం పర్యటించింది. ఈ బృందం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రముఖ దేవాలయాలు, కేంద్ర ప్రభుత్వం సూచించిన 16 ఇళ్లను పరిశీలించింది. గ్రామంలో పాటిస్తున్న పారిశుధ్య చర్యలపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. టీమ్ లీడర్ ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలో 32 ఎస్ఎస్‌జీ గ్రామాలు ఎంపికైనట్టు తెలిపారు. వాటిలో తొత్తరమూడి ఒకటి అన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య చర్యలపై నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. వీరి వెంట గ్రామ సర్పంచ్ వార జయసావిత్రి, పంచాయతీ కార్యదర్శులు కె.రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

# ఎంపీపీ అధ్యక్ష ఎన్నిక రెండోసారి వాయిదా



అధ్యక్ష ఎన్నిక సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు

**రాజోలు:** స్థానిక మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక గురువారం రెండోసారి వాయిదా పడింది. ఎన్నికల పరిశీలకురాలు, డీఆర్వో రాజకుమారి ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు సమావేశం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. టీడీపీ అధిష్టానం సూచనల మేరకు ఆ పార్టీకి చెందిన ఎంపీటీసీలతోపాటు, జనసేన ఎంపీటీసీలు అధ్యక్ష ఎన్నిక సమావేశానికి దూరమయ్యారు. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, ఇండిపెండెంట్ ఎంపీటీసీ కట్టా కృష్ణ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. కోరం సరిపడకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాజోలు మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో జరిగిన పరిణామాలను వివరిస్తామని పరిశీలకురాలు రాజకుమారి తెలిపారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్ ఇటీవల చనిపోవడంతో ఎంపీపీ స్థానం ఖాళీ ఏర్పడింది. ఆయన చనిపోయి 15 రోజులు కూడా కాకుండానే అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేయడంపై ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడుకి వారు ఫిర్యాదు చేయడంతో అధ్యక్ష ఎన్నిక సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాకుండా చూడాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశానుసారం ఎంపీటీసీలు అధ్యక్ష ఎన్నిక సమావేశానికి గైర్హాజరయ్యారు. భవిష్యత్‌లో ఎంపీపీ స్థానాన్ని కేతా శ్రీనివాస్ భార్య వెంకటలక్ష్మికి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. అంతవరకు ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాన్ని తాత్కాలికంగా మండల ఉపాధ్యక్షుడిగా ఉన్న ఇంటిపల్లి ఆనందరాజు, పాలమూరి శ్యాంబాబుల్లో ఒకరికి అప్పగించే అవకాశం ఉంది.

# ప్రజల పక్షాన పోరాటం చేయండి

**మామిడికుదురు:** ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని రాజ్యసభ మాజీ సభ్యురాలు, పిఠాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత పార్టీ శ్రేణులకు సూచించారు. ఆమె గురువారం కొమరాడ వచ్చారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిశోర్, జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చుల విష్ణు, తోరం భాస్కర్, భూపతి మహేంద్ర, మద్దాల ప్రభాకర్, పోలమూరి గోపాల్ తదితరులు గీతను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆ ప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని గీత సూచించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకుందామన్నారు. దాని ప్రకారమే నియోజకవర్గాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

### జాబ్ మేళాలో 51 మందికి అవకాశం




జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ కేపీ రాజు తదితరులు

**కొత్తపేట:** స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 51 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. కళాశాలలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ అమలాపురం, వికాస, మినిస్ట్రీ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ కాకినాడ,వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ, ప్లేస్మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన జాబ్‌మేళా నిర్వహించారు. 12 కంపెనీలు జాబ్‌మేళా నిర్వహించగా 146 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వారి అర్హతలు పరిశీలించి, వారిలో 51 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసి, ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. మరో 29 మంది అభ్యర్థులు తదుపరి ప్రక్రియకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ డీ హరిశేషు, వికాస మేనేజర్ జీ రమేష్, మినిస్ట్రీ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పీ ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్‌డీసీ సిబ్బంది, వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, ప్లేస్మెంట్ ఆఫీసర్ అండ్ జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ శ్రీనివాసులు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.